క్లుప్తంగా

మాజీ మంత్రి వెలంపల్లికి ఆత్మీయ సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు జగ్గయ్యపేట ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు జగ్గయ్యపేటకు వచ్చిన ఆయన వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ మాజీ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు చౌడవరపు జగదీష్‌కు చెందిన షోరూంకు వచ్చారు. అక్కడ ఆయనను పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు కలసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు వెన్నా ప్రశాంత్, చౌడవరపు సాయి, నూకల రామలింగం పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీనటుడు బాలకృష్ణ జన్మదినం సందర్భంగా శుక్రవారం సినీ సంగీత విభావరి, గాయని విష్ణుప్రియకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలను నగరానికి చెందిన గాయనీ గాయకులు విష్ణుప్రియ, రసూల్ బాబు, ప్రజ్ఞ, రాఘవశర్మ, హరీష్ శర్మ, రాంబాబు ఆలపించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ బాలకృష్ణ సినీ రంగ సేవలను వివరించారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి సంస్థ లక్ష్యాలను తెలిపారు. వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, వడ్డాది కామేశ్వరి, కొమ్మినేని రత్నకుమారి, చావా నరసింహారావు, గరిమెళ్ల నాని పాల్గొన్నారు. గాయకురాలు విష్ణుప్రియ దంపతులను నిర్వాహకులు సత్కరించారు.

విద్యారంగం-సంస్కరణలు అంశంపై నేడు ప్రత్యేక ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సులో భాగంగా శనివారం వర్చువల్ విధానంలో ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, కవి, వాడ్రేవు చిన వీరభద్రుడు హాజరై తెలుగు జర్నలిజంలో మాండలికాలు-ప్రభావం అనే అంశంపై మాట్లాడతారన్నారు. అనంతరం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి హాజరై ఆంధ్రప్రదేశ్ విద్యారంగం-సంస్కరణలు అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ-815 9892 6979, పాస్‌వర్డ్-12345 ద్వారా హాజరై ప్రసంగాలను వినవచ్చని తెలిపారు.

నోటిఫై సాంక్రమిక వ్యాధిగ్రస్తుల వివరాలు తెలపాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు నోటి ఫై సాంక్రమిక వ్యాధులకు గురైన రోగులు వస్తే ఆ సమాచారం తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. సాంక్రమిక వ్యాధులైన కలరా, మలేరియా, తరుణ విరోచన వ్యాధులు, డెంగీ, మీజిల్స్, చికెన్‌పాక్స్, టీబీ వ్యాధిగ్రస్తులు ఆస్పత్రిలకు వస్తే, ఆ వివరాలను ప్రతిరోజూ పోర్టల్‌లో తెలియచేసి, పీ-ఫామ్, ఎల్-ఫామ్ నింపాలని ఆమె సూచించారు. ఎపిడిమిక్ రావడానికి అవకాశం ఉన్న వ్యాధులపై నిఘా ఉంచడం ద్వారా ఆ వ్యాధుల వ్యాప్తి, కేసులు నమోదు తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సాంక్రమిక వ్యాధిగ్రస్తులు వస్తే పోర్టల్‌లో ఫామ్ పీ, ఎల్‌ను నింపాలని ఆమె తెలిపారు.

గృహయోగం



ఈమె పేరు సరస్వతి. ఈమెది నందిగామ మండలం ఐతవరం. వీరిది వ్యవసాయ కూలీ కుటుంబం. గత 30 ఏళ్లుగా వీళ్లు అద్దె ఇంటిలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈమె భర్త గత ఏడాది మృతి చెందాడు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు. భర్త బతికి ఉన్న సమయంలో ఇద్దరూ పనికి వెళ్లి వచ్చిన కూలి డబ్బులో కొంత దాచుకొని ఏదోలా ఇద్దరు ఆడపిల్లల పెళ్లి చేశారు. ఇక ఆమె సొంతింటి కల మాత్రం నెరవేరలేదు. జీవితంలో ఇక సొంత ఇంటి యోగం లేదని సరస్వతి భావించింది. ఈ తరుణంలో సరస్వతికి అందని ద్రాక్షలా ఉన్న సొంత ఇంటి కల నెరవేరింది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకుని గత ఎనిమిది నెలలుగా సొంత ఇంట్లోనే సరస్వతి నివాసం ఉంటోంది. నాలాంటి పేద మహిళలకు కూడా సొంత ఇంటి భాగ్యం దక్కుతోందంటే అది నిజంగా జగనన్న పుణ్యమే. నేనే కాదు నాలాంటి ఎంతోమంది మహిళలు జగనన్నకు రుణపడి ఉంటారు..... ఇవి సరస్వతి సంతోషంతో చెప్పిన మాటలు. ఇదేవిధంగా ప్రతి గ్రామంలోనూ వందలాదిమంది పేదల కళ్లల్లో ఆనంద బాష్పాలతో కూడిన సంతోషం కనిపిస్తోంది.



వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు

- నందిగామ డివిజన్‌లో 21,371 గృహాలు మంజూరు
- జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- ప్రతి నిరుపేదకు గూడు కల్పిస్తున్న ప్రభుత్వం
- సాకారమవుతున్న పేదల కల

నందిగామ: ప్రతి నిరుపేదకు గూడు కల్పించడమే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా 30 లక్షల మందికి పైగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో గల ఏడు మండలాల్లో మొత్తం 21,371 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది.వాటిలో ఇప్పటికే కొన్ని ఇళ్లు పూర్తికాగా వాటిలో నివాసం కూడా ఉంటున్నారు. మరికొన్ని ఇళ్లు తుది దశలో ఉన్నాయి. ప్రస్తుతం డివిజన్ పరిధిలోని అన్ని లే అవుట్ లలో ఇళ్ల నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి.

అన్ని వసతులతో జగనన్న కాలనీలు

కేవలం గృహాలు మంజూరు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా ఆయా కాలనీల్లో నివాసం ఉండే వారికి అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే... పేద వారి కోసం ఏకంగా ఓ మినీ గేటెడ్ కమ్యూనిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. విశాలమైన రహదారులు, నిరంతరంగా మంచి నీటి సదుపాయం, వీధి లైట్లు, మురుగు నీటి పారుదల సదుపాయం, ఇంటర్‌నెట్ వంటి సదుపాయాలతో ఈ కాలనీలు అత్యాధునికంగా రూపొందనున్నాయి. దీంతో లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఉత్సుకత చూపుతున్నారు. డివిజన్ పరిధిలోని గ్రామాల్లో 2014 నుంచి 2019 వరకు పేదవాళ్లకు అప్పటి పాలకులు కేవలం 2674 ఇళ్లు మాత్రమే నిర్మించి ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా అర్హులైన ప్రతి పేదవారికీ ఇంటిని నిర్మించి ఇస్తోంది.

డివిజన్ పరిధిలో 222 లేఅవుట్‌లు

డివిజన్ పరిధిలోని మొత్తం ఏడు మండలాలలో 222 లేఅవుట్‌లు ఉన్నాయి. ఆయా లే అవుట్ లలో మొత్తం 21,371 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 9,521 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 3826 మంది లబ్ధిదారులు ఇప్పటికే నివాసం ఉంటున్నారు. మిగిలినవి పలు దశలలో ఉన్నాయి.

మా గ్రామంలోనే 179 ఇళ్లు నిర్మించాం



జగనన్న పుణ్యమాని ఒక్క మా గ్రామంలోనే 179 ఇళ్లు నిర్మించాం. ఎంతోమంది పేద వాళ్లకు జగనన్న గూడు కల్పిస్తున్నారు. నిజంగా ఆయన రుణం తీర్చుకోలేనిది.

–నాయుడు ఉదయలక్ష్మి, గ్రామ సర్పంచ్, ఐతవరం

ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు



డివిజన్ పరిధిలో నవరత్నాలలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామంలోని సిబ్బందితో ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ లబ్ధిదారులు ఇళ్ల త్వరగా పూర్తి చేసుకునేలా చూస్తున్నాం.

–రవీంద్రరావు, ఆర్డీవో, నందిగామ

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

ఈద్గా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్సీ అరుణకుమార్



ఈద్గా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో నూతనంగా చేపడుతున్న ఈద్గా నిర్మాణ పనులకు గురువారం రాత్రి ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ముస్లింలకు అత్యంత ప్రాధాన్యం కల్పించారన్నారు. గత ప్రభుత్వంలో ముస్లింలకు కేబినెట్‌లో స్థానం కూడా దక్కలేదని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి పదవితో పాటు ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిని ముస్లింలకు కట్టబెట్టి ముస్లింలపై ఆయనకున్న అభిమానాన్ని చాటుకున్నారని కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌లు కల్పించి వారి హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సైతం తండ్రి బాటలో నడుచుకుంటూ ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఈద్గా నిర్మాణ పనులకు సహకరిస్తున్న కరిముల్లాను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ చావల రవిబాబు, పీఏసీఎస్ చైర్మన్ రాయల జానకిరామయ్య, నాయకులు షేక్ షికూర్, యాకుబ్ వలీ, షేక్ సైదా, షేక్ సుభానీ, షేక్ లాల్‌సా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో కుటుంబాలలో సంతోషం

గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందలూరు గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందలూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో నిరుపేదల కుటుంబాలలో సంతోషాన్ని నింపుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని నందలూరు గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి అయ్యాక అమలు చేశారని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తీసుకురావటమే కాకుండా రెండు వేలకు పైగా జబ్బులను ఆ పథకంలో చేర్చి మెరుగైన ఉచిత వైద్యం అందిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా కరోనాను సైతం ఆరోగ్య శ్రీలో చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మంచి చేయటమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కోరారు. గడపగడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ కత్తి తిరుపతిరావు, నాయకులు ఏలూరు సురేష్, జూపూడి కోటేశ్వరరావు, మర్రి గోపి, జూపూడి జమదగ్ని, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆడపిల్ల బరువు కాదు బాధ్యత

ఆర్డీవో రవీంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: ఆడపిల్లను బరువు అనుకోకుండా బాధ్యతగా భావించాలని ఆర్డీవో రవీంద్ర రావు అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల చట్టం 2006 నిబంధనలపై డివిజన్ పరిధిలోని అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఆడపిల్లను తల్లిదండ్రులు బరువు అనుకోకుండా బాధ్యతగా భావించి ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చూడాలన్నారు. రాష్ట్ర బాలల సంరక్షణ కమిటీ సభ్యుడు రాజేంద్ర మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు భార్గవ్, ఐసీడీఎస్ సీడీపీఓలు భాగ్య రేణుక, లక్ష్మీ భార్గవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ బాలాజీ, ఎస్‌ఐ పండుదొర పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు కాపాడటమే లక్ష్యం

నందిగామ: భక్తుల మనోభావాలు కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తామని శివాలయం ఈవో సీతారామయ్య తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన కోనేరు లోని వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరుకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. కోనేరు వద్ద బయటపడ్డ ఆలయంలోని శివలింగానికి ఇప్పటికే సంప్రోక్షణ నిర్వహించామన్నారు. భక్తుల మనోభావాలు కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ముందుగా కోనేరులోని వ్యర్థాలను తొలగించిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశానుగుణంగా కోనేరుకు పూర్వ వైభవం వచ్చేలా చూస్తామన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగనన్న



జగ్గయ్యపేటఅర్బన్: మహిళలను లక్షాధికారులను చేయాలనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా చాటుకున్నారని ఐదవ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ అన్నారు. స్థానిక 5 వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డ్వాక్రా గ్రూపుల సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ వార్డులో రెండు డ్వాక్రా గ్రూపులకు ఆసరా పథకం కింద రూ.19,70,000 జమ అయినట్లు తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తున్న సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే ఉదయభానుకు మనమంతా అండగా ఉండాలని కోరారు. సమావేశంలో పట్టణ సమైఖ్య సీవో నిర్మల, ఆర్పీలు నాగమణి, శైలజ, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ ప్రసక్తే లేదు

ప్రభుత్వ విప్ ఉదయభాను



ఊర చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక చెరువు బజారులో ఊర చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా 560 మీటర్ల పైగా ఏర్పాటుచేసిన గ్రిల్స్‌తో కూడిన ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రగతిపథంలో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా జగ్గయ్యపేటను జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. అందుకోసం జగ్గయ్యపేట ఊర చెరువును హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్, ఖమ్మంలో లకారం మాదిరిగా సుమారు రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. దానిలో భాగంగా ఊర చెరువునంతా ప్రక్షాళన చేసి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, లైటింగ్, బోటు షికారు, ఓపెన్ జిమ్ తదితర హంగులతో చెరువును అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఇందుకుగాను అల్ట్రాటెక్ వారు సీఎస్సార్ నిధుల నుంచి రూ.కోటి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు కేటాయించడంతో గత మూడు నెలల నుంచి వేగవంతంగా పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సాధుపాటి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వర్లు, పక్కన వ్యవసాయాధికారులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పరిటాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు ఆర్‌బీకేల్లో అందుతున్నాయన్నారు. రైతులకు అవసరమైన యంత్ర పనిముట్లు గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వరి విత్తనాలు కూడా సరఫరా చేస్తామన్నారు. ఎరువులు కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. 40 శాతం సబ్సిడీపై రైతులకు డ్రోన్లు ఇస్తామని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, సలహా మండలి సభ్యులు చెరుకుమల్లి రాంబాబు, పి.రవి, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి



అనిగండ్లపాడులో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పెనుగంచిప్రోలు: చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవరచుకోవాలని గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాల్లో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించటంతో పాటు మహానుభావుల జీవిత చరిత్రలు తెలియజేశారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలు వివరించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

గంటాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న గంటాలమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజ, తీర్థ ప్రసాద వినియోగాలు కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తుల్జా భవానీ వార్షికోత్సవం

గ్రామంలో ఉన్న గిరిజన ఆరాధ్య దైవం తుల్జా భవానీ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కుబియా నాయక్ తెలిపారు. అమ్మవారికి విశేష పూజలు, గ్రామోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన చెన్నారావు

వత్సవాయి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ చెన్నారావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి వత్సవాయికి ఆయన బదిలీపై వచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. కార్యాలయం సిబ్బంది ఎంపీడీవోను అభినందించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



పేట గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం పొడుపు కథలు చెప్పించారు, ఆటపాటలు ఆడించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది రమేష్, బీడీసీ మల్లిక పాల్గొన్నారు.

షూటింగ్ జాతీయ జట్టు సెలక్షన్ ట్రయిల్స్‌కు అర్హత



షూటింగ్ క్రీడాకారిణి తమన్న్య

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ షూటింగ్ జట్టు సెలక్షన్ ట్రయిల్స్‌కు విజయవాడకు చెందిన శిరంగి తమన్న్య అర్హత సాధించింది. కేరళలోని త్రివేండ్రంలో ది నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల నిర్వహించిన కుమార్ నరేంద్రసింగ్ మెమోరియల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌కు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పిప్‌పెట్ట్ విభాగంలో తమన్న్య రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి 603.9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో జూలై నెలలో జరిగే జాతీయ యూత్ విభాగం జాతీయ జట్టుకు సెలక్షన్ ట్రయిల్స్‌కు అర్హత సాధించింది. 11 ఏళ్ల తమన్న్య తాడిగడపలోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ శిక్షణ పొందుతోంది. జాతీయ జట్టు సెలక్షన్ ట్రయిల్స్‌కు అర్హత సాధించిందిన క్రీడాకారిణిని అకాడమీ డైరెక్టర్, చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రాజ్‌కుమార్ అభినందించారు.